సంపుటి :02 సంచిక :233 పేజీలు :07 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 18, నవంబర్ 2025



# బొమ్మాపూర్ ఇసుక కాంట్రాక్టర్ అరాచకం!

- లోడింగ్ ఛార్జీ పేరుతో బరితెగిస్తున్న వైనం
- ఒక్కో లారీకి రూ. 4 వేల బలవంతపు వసూళ్లు
- కాంట్రాక్టర్ తో కుమ్మక్కైన సంబంధిత అధికారులు
- మిగతా క్వారీల్లో సైతం అదే తంతు
- తగ్గేదేదంటున్న ఇసుక కాంట్రాక్టర్లు
- చోద్యం చూస్తున్న టీజీఎండీసీ

04



# ఎకరాకు 12 క్వింటాళ్లు కొనాలి

- సీసీఐవి తుగ్లక్ నిర్ణయాలు
- పత్తి కొనుగోలు నిబంధనలను సవరించాలి
- తేమశాతం పరిమితులను ఎత్తివేయాలి
- కపాస్ యాప్ ను రద్దు చేయాలి
- సాంకేతిక ఇబ్బందులకు తాళలేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు
- మద్దతు ధరను వదులుకుని తక్కువ ధరకు అమ్మేస్తున్నారు..
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ సందర్శనలో మాజీ మంత్రి హరీశ్‌రావు

05

# మావోయిస్టు మాస్టర్ మైండ్ హిడ్మా ఎన్ కౌంటర్

మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. పార్టీలో మాస్టర్ మైండ్‌గా , గెరిల్లా దాడుల వ్యూహకర్త, యాక్షన్ టీం లీడర్ పేరున్న పార్టీ అగ్రనేత, సెంట్రల్ కమిటీ సభ్యుడు మడావి హిడ్మా భద్రతా దళాల కాల్పుల్లో మృతిచెందాడు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతంలోని మారేడుమిల్లిలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా తో ఆయన భార్య హేమ అలియాస్ రాజే సహా నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు జాంబ్రీ అలియాస్ చెల్లూరి నారాయణరావు, పార్టీ కీలక సభ్యుడు టెక్ శంకర్, మరో ఇద్దరు పార్టీ సభ్యులు ఉన్నారు. హిడ్మా పై రూ.కోటి పైగా రివార్డు, ఆయన భార్య రాజేపై రూ.50 లక్షల రివార్డు ఉంది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02

- ఏపీలోని రంపచోడవరం అడవుల్లో ఎదురుకాల్పులు
- ఆయన భార్య హేమతో పాటు మరో నలుగురు మావోయిస్టులు మృతి
- హిడ్మా పేరుపై రూ.కోటి, హేమ పేరుపై రూ.50 లక్షల రివార్డు
- ఏడాదిన్నర నుంచి హిడ్మా వేట.. ఎట్టకేలకు చిక్కి కాల్పుల్లో మృత్యువాత









# భద్రతా దళాల ఆపరేషన్ ఆంధ్రా

04

- విజయవాడలో 31 మంది, కాకినాడలో ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్
- బృందంలో పార్టీ సుప్రీం కమాండర్ తిప్పర్తి తిరుపతి?
- మరో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులూ
- భారీగా ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం
- రేపు వివరాలు వెల్లడిస్తాం: ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా
- ఏలూరులో మరో 15 మంది మావోయిస్టులు అదుపులోకి..

# తుపాకీని కాదు ప్రజాస్వామ్యాన్ని నమ్ముకోండి

04



- అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి చెడిపోవద్దు
- ఇకపై ఎవరైనా తుపాకీ పడతామంటే కుదరదు
- హిడ్మా సంగతి ఏమైందో ప్రపంచమంతా చూస్తోంది..
- యువతకు కేంద్రమంత్రి బండి సంజయ్ హితవు

# 25 రెట్ల పెనాల్టీ తొలగింపు

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- నగర మేయర్ గుండు సుధారాణి
- మినహాయింపు చేసిన సీఎంకు గ్రేటర్ వరంగల్ పక్షాన కృతజ్ఞతలు
- కృషి చేసిన ఇంచార్జి మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకూ ధన్యవాదాలు
- రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్ల పురోగతిపై సమావేశం

06

# అంబేద్కర్ భవనాన్ని అప్పగించాలి

## ఎమ్మెల్యే గండ్రకు సంఘం ప్రతినిధుల వినతి

అక్షర దర్బార్, చిట్యాల  : చిట్యాల మండల కేంద్రంలో సుమారు మూడు సంవత్సరాల క్రితం రూ.23 లక్షల వ్యయంతో నిర్మించి ప్రారంభించిన అంబేద్కర్ భవనం ఇంకా అంబేద్కర్ సంఘానికి అప్పగించకపోవడంతో సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ మాట్లాడుతూ.. అంబేద్కర్




సంఘం కోసం నిర్మించిన భవనం వినియోగంలో లేకుండా నిరుపయోగంగా మారిందని, ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయిందని ఎమ్మెల్యే గారికి వివరించినట్లు తెలిపారు. వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెంటనే అధికారులతో మాట్లాడి అంబేద్కర్ భవనం సంఘానికి అప్పగించే ప్రక్రియను త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

# రైతులను మోసం చేసిన ప్రభుత్వం

## బీజేపీ జిల్లా నాయకుడు లాడే శివ



అక్షర దర్బార్, పరకాల:రబీ పంటకు వాగ్దానం చేసిన క్వింటాలుకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోవడం రైతులను మోసగించడం అని బీజేపీ జిల్లా నాయకుడు లాడే శివ విమర్శించారు. బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలున్నప్పటికీ బోనస్ ఆశతో వడ్లను ప్రభుత్వానికి విక్రయించిన రైతులు తీవ్రంగా నష్ట పోయారని ఆయన అన్నారు. ఎన్నికల ముందు రుణమాఫీ హామీ ఇచ్చి, కేవలం 50% మందికే మాఫీ చేయడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. రబీ బోనస్‌ను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.







మృతిచెందిన హిడ్మా, హేమ దంపతులు

# మావోయిస్టు మాస్టర్ మైండ్ హిడ్మా ఎన్ కౌంటర్

- ఏపీలోని రంపచోడవరం అడవుల్లో ఎదురుకాల్పులు
- ఆయన భార్య హేమతో పాటు మరో నలుగురు మావోయిస్టులు మృతి
- హిడ్మా పేరుపై రూ.కోటి, హేమ పేరుపై రూ.50 లక్షల రివార్డు
- ఏడాదిన్నర నుంచి హిడ్మా వేట.. ఎట్టకేలకు చిక్కి కాల్పుల్లో మృత్యువాత

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. పార్టీలో మాస్టర్ మైండ్‌గా , గెరిల్లా దాడుల వ్యూహకర్త, యాక్షన్ టీం లీడర్ పేరున్న పార్టీ అగ్రనేత, సెంట్రల్ కమిటీ సభ్యుడు మడావి హిడ్మా భద్రతా దళాల కాల్పుల్లో మృతిచెందాడు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతంలోని మారేడుమిల్లిలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతో ఆయన భార్య హేమ అలియాస్ రాజే సహా నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు జాంబ్రీ అలియాస్ చెల్లూరి నారాయణరావు, పార్టీ కీలక సభ్యుడు టెక్ శంకర్, మరో ఇద్దరు పార్టీ సభ్యులు ఉన్నారు. హిడ్మాపై రూ.కోటి పైగా రివార్డు, ఆయన భార్య రాజేపై రూ.50 లక్షల రివార్డు ఉంది.

### - నాలుగు రాష్ట్రాలకు మోస్ట్ వాంటెడ్

మావోయిస్టు పార్టీ ఉద్యమంలో కీలకమైన నేతగా హిడ్మాకు పేరుంది. చనిపోయేముందు వరకు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) కంపెనీ వన్ కమాండర్‌గా ఉన్నాడు. దీనిలోని సభ్యులు అత్యాధునిక ఆటోమేటిక్ ఆయుధాలను వినియోగిస్తారు. ఈ బెటాలియన్‌లో 350 వరకు ఉంటారని సమాచారం. ఆయన స్వస్థలం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామం. ఆ రాష్ట్రంలో మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న సభ్యుల్లో ఈ గ్రామానికి చెందిన మల్లా, నిషాద్ వర్గాల ప్రజలే ఎక్కువగా ఉన్నారు. హిడ్మా పాతికేళ్ల క్రితం 17 ఏళ్ల ప్రాయంలో అడవిబాట పట్టాడు. పార్టీలో ప్రోత్సహించిన వారిలో మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ ఒకరు. ఇప్పటివరకు భద్రతా బలగాలపై జరిగిన అనేక దాడులకు హిడ్మా నాయకత్వం వహించాడు. ఆయన దళానికి అత్యంత శక్తివంతమైన టీంగా పేరుంది. హిడ్మా ఛత్తీస్ గడ్ సహా నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్.

### - పలు భాషలపై పట్టు

హిందీ, గోండి, తెలుగు, కోయ, బెంగాలీ భాషపై ఆయనకు పట్టుంది. చిన్నవయస్సులోనే కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నియ్యాడు. 2023లో దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన చనిపోయినట్లు ప్రచారం జరిగింది. ఆ వెంటనే ఫొటో రిలీజ్ చేసి పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అప్పటి నుంచి మావోయిస్టుల మూడంచెల భద్రతా వ్యవస్థ నడుమ క్షేమంగా ఉన్నాడు. ఆ తర్వాత ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా బలగాలు హిడ్మా కోసం ప్రత్యేకంగా ఆపరేషన్‌ను కొనసాగించాయి. మూడు రాష్ట్రాలకు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నాడు. కొంతకాలం క్రితం కేంద్ర కమిటీలో స్థానం సంపాదించాడు. సాధారణంగా ఈ కమిటీలో తెలుగు రాష్ట్రాల వారు అత్యధికంగా ఉంటారు. కానీ, సుక్మా నుంచి ఈ స్థానంలోకి వెళ్లిన తొలి వ్యక్తి హిడ్మానే. రెండు వారాల క్రితం ఆయన తల్లిని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, హోం మంత్రి కలిశారు. తన కుమారుడిని లొంగిపోయేలా ఒప్పించాలని ఆమెను కోరారు. ఇప్పటికైనా ఇంటికి రా బిడ్డా అని ఆమె హిడ్మాను వేడుకున్నారు. ఈలోపే ఎన్‌కౌంటర్ సంభవివంచడం, హిడ్మా మృతిచెందడమూ జరిగిపోయింది.

### - నాయకత్వం వహించిన దాడులు

హిడ్మా మొత్తం 26 కీలకమైన దాడుల్లో నాయకత్వం వహించాడు. ఆ మొత్తం కేసుల్లో ఆయనే సూత్రధారి, ప్రధాన నిందితుడు. 2007లో సుక్మా జిల్లా ఉర్పల్‌మెట్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై దాడి చేసి పలువురు జవాన్ల మృతికి కారణమయ్యాడు. 2010లో తడ్‌మెట్ల మెరుపు దాడిలో 76 మంది జవాన్లు మృతి చెందారు. 2013లో జీరామ్‌ఘాటీ వద్ద కాంగ్రెస్ నేతలను ఊచకోత ఘటనలో హిడ్మాదే కీలక పాత్ర. 2017 ఏప్రిల్‌లో సుక్మా జిల్లాలో 27 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను హతమార్చాడు. 2021 ఏప్రిల్ 4న బీజాపూర్ జిల్లా తరెంలో హిడ్మా వ్యూహంలో చిక్కుకుని 23 మంది జవాన్లు మృతిచెందారు. ఇలా 200 మందికి పైగా పోలీసు సిబ్బంది మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా హిడ్మానే కారణమని పోలీసులు భావిస్తున్నారు.



# పరకాలలో పెరుగుతున్న స్థిరాస్తి లాటరీలు...

## అనుమానాస్పద స్కీములతో ప్రజల్లో ఆందోళనలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణ పరిసర ప్రాంతాల్లో లక్కీ డ్రా పేరిట స్థిరాస్తి అమ్మకాల కోసం కొత్తగా వెలువడుతున్న స్కీములు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాజుపేట శివారులో ఒక ప్లాట్ యజమాని “రూ.1800 కట్టి ప్లాటు దక్కించుకోండి” అంటూ ప్రచారం ప్రారంభించగా, మరో కొత్త రియల్ ఎస్టేట్ యజమాని రూ.2500కే కోటి రూపాయల ఆస్తి అందిస్తామని స్కీం ప్రకటించడం, 200 కి బైక్ వస్తుందని ఆఫర్ స్కీములు స్థానికులను కలవరపెడుతున్నాయి.

### సభ్యులు చేరకపోతే నష్టపోయేది ఎవరు?

ఈ స్కీములు నిజంగా అమల్లోకి రావాలంటే భారీ సంఖ్యలో సభ్యులు చేరాలి. కానీ సభ్యులు తగినంతగా చేరకపోతే కట్టిన వారి డబ్బు ఏమవుతుందో అన్న అనుమానాలు ప్రజలను వేధిస్తున్నాయి. “సభ్యులు రాకపోతే మా డబ్బు ఏమవుతుంది? మాకే నష్టం కదా?” అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్థిక మోసాలపై కఠిన చర్యలు: సీఐ క్రాంతి కుమార్

పరకాలలో స్థిరాస్తి లాటరీల పేరుతో జరుగుతున్న ఆర్థిక మోసాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని పరకాల సీఐ వి. క్రాంతి కుమార్ తెలిపారు. ప్రజల కష్టార్జిత సంపాదనను లక్ష్యంగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మోసపూరిత పద్ధతుల్లో లాటరీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందని, వాటిపై దర్యాప్తు మొదలైందని ఆయన స్పష్టం చేశారు.

# కేంద్ర పథకాల అమలుపై పర్యవేక్షణ ఉండాలి

## ఎంపీ డా. కడియం కావ్య ఆగ్రహం

అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లా అభివృద్ధి పనుల్లో కేంద్ర పథకాల అమలుపై పర్యవేక్షణ ఉండాలని ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ డా. కడియం కావ్య అన్నారు. వైద్యసేవల్లో ఆపరేషన్ల శాతం అధికంగా ఉండటంపై అవగాహన కల్పించాలని, డయాలసిస్ సేవలు వెంటనే అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. 12 పిహెచ్‌సీలకు స్థల సమస్యపై స్పష్టత లేకపోవడంపై మండిపడ్డారు.డీఈఓ సమగ్ర వివరాలు ఇవ్వకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కెజిబివి, పాఠశాలల్లో ఆరోగ్య కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన మెనూ అమలు కచ్చితంగా చేయాలని సూచించారు. సింగరేణి, జెన్‌కో సీఎస్ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు మళ్లిస్తున్నారని ప్రశ్నిస్తూ హాజరుకాని అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కూడా సీఎస్ఆర్ నిధుల వినియోగంపై మండిపడి, ప్రాథమిక పనులకు నిధులు ఇవ్వాలని కోరారు. డీఎంఎఫ్టీ నిధులు పక్కదారి పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ రాహుల్ శర్మ సమస్యలపై శాఖలు సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, డీఆర్డీఓ బాలకృష్ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, కెటిపిపి సీఈ శ్రీ ప్రకాష్, సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, అన్ని శాఖల




జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి

## వీసీకే యూత్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్



అక్షర దర్బార్ చిట్యాల: ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని కోరుతూ విముక్త చిరుతల పార్టీ (VCK) యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు అంబాలా అనిల్‌కుమార్, విద్యార్థి విభాగం నాయకులతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును చిట్యాలలో మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నట్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు హోటళ్లు, బేకరీలు ఆధారపడుతున్న పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు అనిల్ తెలిపారు. విద్యార్థుల సమస్యలు విన్న ఎమ్మెల్యే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని త్వరలో ప్రారంభిస్తామని, చిట్యాల జూనియర్ కాలేజీలో వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కనకం, ఇతేష్, కృష్ణ, తేజ, తోట అభినయ్, శివ హరికుమార్ ఉన్నారు.

# ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

## ఆలయంలో కొనసాగుతున్న పూజలు

అక్షర దర్బార్, నర్సంపేట : శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో జరుగుతున్న 25వ మండల పూజల భాగంగా మహా అన్నదాన కార్యక్రమం మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. రూప ఇండస్ట్రీస్ చకిలం శారద కృష్ణమూర్తి, బిర్రు రాజేశ్వరి–సునీల్ కుమార్, దాసరి పద్మ–జయేందర్ రెడ్డి అన్నదాతలుగా వ్యవహరించారు అని ట్రస్టు చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, అధ్యక్షుడు సైపా సురేష్ తదితరులు తెలిపారు.



### 108 కుర్చీల బహుకరణ

అయ్యప్ప గురుస్వామి, వ్యాపారి మిడుదొడ్డి బాబురావు దేవాలయానికి 25 వేల రూపాయల విలువైన 108 కుర్చీలను దానం చేశారు.



# గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ పై షీ టీమ్ అవగాహన

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు, భూపాలపల్లి షీ టీమ్ మంగళవారం సింగరేణి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, పాక్సో చట్టం, బాలల దుర్వినియోగం నివారణ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 వంటి అంశాలపై అవగాహన కల్పించింది. షీ టీమ్ సభ్యులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా, అనుమానాస్పద పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, వెంటనే ఎవరికి తెలపాలి వంటి అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ఏదైనా అసౌకర్యం ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. చిన్నారుల భద్రత కోసం సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, పాఠశాల స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని ఎస్పీ




కిరణ్ ఖరే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని షీ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు



# స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధంగా ఉండాలి

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

అక్షర దర్బార్, నల్లబెల్లి: స్థానిక ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్ణసిద్ధతతో ముందుకు రావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ అధ్యక్షతన బూత్ అధ్యక్షుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. “రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థానం కోసం బీజేపీ పోటీలో ఉంటుంది. అధిక స్థానాలు గెలిచేలా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పెరుమాండ్ల కోటి, నాగిరెడ్డి రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఈర్ల నాగరాజు, గుగులోతు తిరుపతి, మండల ఉపాధ్యక్షులు బత్తిని కుమారస్వామి, గుర్రపు నరేష్, సింగిరెడ్డి యాదగిరి, భూక్యా మైభూ, మండల కార్యదర్శులు మర్రి నాగరాజు, బూర కృష్ణ, పున్నం కృష్ణమూర్తి, కోశాధికారి మురికి మనోహర్, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం...

## మున్సిపల్ కమిషనర్ కే సుష్మ

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ కమిషనర్ సుష్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అందరూ ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ సుష్మ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలు సమాజాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెప్మ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నడికూడ తహసీల్దార్ కార్యాలయంలో

నడికూడ మండల తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాణి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అనిత, సంపూర్ణ, కళావతి పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ రెండవ దశకు బీఎన్ రెడ్డి పేరు పెట్టాలి

అక్షర దర్బార్, దుగ్గొండి: రైతాంగ సాయుధ పోరాట నేత అమరజీవి భీమిరెడ్డి నరసింహారెడ్డి గారి పేరును శ్రీరాం సాగర్ ప్రాజెక్టు రెండవ దశ కాలువకు పెట్టాలని, సూర్యపేట జిల్లాను “బీఎన్ రెడ్డి జిల్లా”గా నామకరణం చేయాలని ఎమ్‌సిపిఐ(యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ కోరారు. నిజాం వ్యతిరేక పోరాటంలో, భూముల పంచాయితీలో ఆయన చేసిన త్యాగాలు అపారమని పేర్కొన్నారు. ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ప్రతిష్టించడంతో పాటు, ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. పార్టీ



నాయకులు కుసుంబ బాపురావు, మాజీ సర్పంచ్ మహమ్మద్ హుస్సేన్, కొమురయ్య పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## –టీపీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి

నెక్కొండ, అక్షర దర్బార్: రైతులు దళారులపై ఆధారపడకుండా ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి సూచించారు. మంగళవారం నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామంలో ఐకెపి పరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దు. ప్రభుత్వ కేంద్రాల్లోనే అమ్మకం జరపాలి” అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బక్కి అశోక్,



కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, నాయకులు సాయి కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మెరుగు కుమారస్వామి, పులి నవీన్, కొయ్యడ రాంబాబు, యూత్ నాయకులు చీరా కిరణ్, చీరా ఐలయ్య, దొరికిన రఘుపతి, సిఏ పోషల ఏకాంబరం, వ్యవసాయ శాఖ అధికారులు, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.




# మాదకద్రవ్యాల నివారణపై ప్లకార్డులతో ర్యాలీ

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో సన్ రైజ్ పాఠశాల విద్యార్థులు మాదకద్రవ్యాల నివారణపై గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం బస్టాండ్ కూడలిలో మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ తిరుపతి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడడం వల్ల వచ్చే అనర్థాలను పిల్లలకు మరియు ప్రజలకు వివరించారు.డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం పిల్లల చేతుల్లో ఉందని అన్నారు.డ్రగ్స్ రహిత భారత్ కి అందరూ కృషి చేయాలని సూచించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయన్న, శ్రీధర్, రాజకుమార్, జ్యోతి, సోని, స్వప్న, రుద్రశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# వాటి జోలికి పోవద్దు

**- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హనుమకొండ: యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మెడికల్ విద్యార్థులకు సూచించారు. ఈ ఏడాది వరంగల్ మెడికల్ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.




ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ర్యాగింగ్ అంశంపై మాట్లాడుతూ కళాశాలలో జూనియర్, సీనియర్ల మధ్య స్నేహ పూర్వకమైన వాతావరణం వుండాలని, ర్యాగింగ్ కు పాల్పడితే ఆరు నెలల నుంచి జీవిత కాలం జైలుశిక్ష పడవచ్చని, విద్యార్థులు ఇలాంటి చర్యలకు పాల్పడితే నమోదయ్యే కేసుల కారణంగా భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఎదురు కావడంతో పాటు అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరని సీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా ఇదే సమయంలో మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని, వీటి వినియోగం వల్ల విద్యార్థులు తమ జీవితాలను అంధకారం చేసుకోవడంతో పాటు, ఆరోగ్య, ఆర్థికపరంగా చాలా నష్టపోతారని, ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్న, విక్రయిస్తున్న తక్షణమే కాలేజీ యాజమాన్యంకు గాని లేదా స్థానిక పోలీసులకు, నార్కోటిక్ విభాగం 1908 నంబర్ కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా వుంచబడుతుందని సీపీ తెలిపారు. సైబర్ నేరాలపై మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నేర గాళ్లు టెక్నాలజీ వినియోగించుకొని నేరాలకు పాల్పడుతున్నారని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మీ సెల్ ఫోన్లకు, ఈమెయిల్ కు వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా వుండాలని. తెలియని వెబ్ సైట్లలో మీ వ్యక్తిగత సమాచారం, ఫోటోలను పోస్ట్ చేయవద్దని, ప్రధానంగా గుర్తు తెలియని వ్యక్తులతో ఆన్ లైన్ ద్వారా ఎలాంటి లావాదేవీలు జరపవద్దని, అలాగే పెట్టుబడులు పెట్టవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, వరంగల్ ఏసీపీ శుభం నాగ్, నార్కోటిక్, సైబర్ విభాగాలకు చెందిన డీఎస్పీలు రమేష్, గిరికుమార్, కేఎంసీ ప్రిన్సిపాల్ డా సంధ్యారాణి, ఎంజీఎం సూపరింటెండెంట్ డా హరిచంద్రరెడ్డి, మట్టెవాడ ఇన్ స్పెక్టర్ కరుణాకర్ తో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎకరాకు 12 క్వింటాళ్లు కొనాలి

- సీసీఐవి తుగ్లక్ నిర్ణయాలు
- పత్తి కొనుగోలు నిబంధనలను సవరించాలి
- తేమశాతం పరిమితులను ఎత్తివేయాలి
- కపాస్ యాప్ ను రద్దు చేయాలి
- సాంకేతిక ఇబ్బందులకు తాళలేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు
- మద్దతు ధరను వదులుకుని తక్కువ ధరకు అమ్మేస్తున్నారు..
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ సందర్శనలో మాజీ మంత్రి హరీశ్‌రావు




అక్షరదర్బార్, వరంగల్ :
ఎల్1, ఎల్2, ఎల్3 విధానం, కపాస్ యాప్ నిబంధన ప్రకారం పత్తిలో తేమశాతం 8 నుంచి 12 ఉండాలనే నిర్ణయం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రూ.8,100ను వదిలిపెట్టుకుని, కేవలం రూ.6 వేలకే ప్రైవేటు కొనుగోలుదారులకు పత్తిని అమ్ముకుంటున్నారు. దళారులను నమ్మి మోసపోతున్నారు. దీంతో క్వింటాకు రూ.2 వేల చొప్పున నష్టపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. సీసీఐ తుగ్లక్ నిర్ణయాల వల్ల రైతులు, రైతుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం ఆయన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని సందర్శించారు. పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. అలాగే ఎకరాకు 5 క్వింటాళ్ల నిబంధన ఎత్తివేసి 12 క్వింటాళ్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 60 సార్లు ఢిల్లీకి పోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పత్తి రైతుల గురించి కేంద్రానికి విన్నవించే అవకాశం రాలేదా అంటూ నిలదీశారు. సీఎంకు బడేభాయి ప్రధాని మోదీతో మంచి సంబంధాలే ఉన్నాయని, ఎందుకని పత్తి రైతుల గురించి బడే భాయికి చెప్పడం లేదని ప్రశ్నించారు.

**- అకాల వర్షంతో పంట నష్టం**

అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయిందని, పంట చేనులన్నీ దెబ్బతిన్నాయని, పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కపాస్ యాని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని అని పేర్కొన్నారు. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచి ఏం చేస్తున్నారని నిలదీశారు. బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చేతకాదని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంటా దాకా అన్నీ సమస్యలేనని ధ్వజమెత్తారు. రైతులకు సమయానికి ఎరువులందం లేదని, కరెంటు సరిగ్గా అందడం లేదని మండిపడ్డారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు.

**- సీఎం ఇంటిముందు పత్తి కుమ్మరిస్తాం**

సీఎం రేవంత్ రెడ్డి మేలుకుని రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రైతులు పండించిన పత్తిని తెచ్చి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంటి ముందు కుమ్మరిస్తామని మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతులపై లాఠీచార్జులు పెరిగాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం విజయోత్సవాలు నిర్వహిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నారా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినందుకు విజయోత్సవాలా? అంటూ నిలదీశారు. పంటల బీమా తెస్తామన్న ఇప్పటివరకు ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. మరోవైపు బీజేపీ బడా కాంట్రాక్టర్లకు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు రైతులను అన్యాయం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం. ఉత్తర భారత దేశంలో పండే గోధుమలకు ఒక నీతి, దక్షిణ భారతదేశంలో పండే వడ్లకొక నీతి పెట్టిందని నిప్పులు చెరిగారు. వరంగల్ వరదల్లో 20 వేల ఇండ్లు మునిగిపోయాయని, సకాలంలో వరద గేట్లు ఎత్తి ఉంటే వరంగల్ నగరం మునిగిపోయేది కాదన్నారు. మునిగిపోయిన ఇళ్లకు రూ. 15 వేల చొప్పున ఇస్తామని, ఎంతవరకు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, టి రవీందర్ రావు, మాజీ మంత్రులు దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు వినయభాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, టి రాజయ్య, నరేందర్, ఆ పార్టీ నేతలు కవిత, సమ్మారావు, సదానందం తదితరులు ఉన్నారు.

## 19 నుండి పత్తి కొనుగోలు ప్రారంభం

అక్షర దర్బార్ చిట్యాల : ఈనెల 19 నుండి పత్తి కొనుగోలు సిసిఐ వారు ప్రారంభిస్తున్న అందున రైతులు తమ పత్తిని అమ్ముకునేందుకు అధికారి స్లాట్ బుక్ చేసుకోవాలని మార్కెటింగ్ జయశంకర్ భూపాలపల్ల జిల్లా అధికారి ప్రవీణ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి జిల్లా లోని జిన్నింగ్ మిల్లు ల యాజమాన్యం రేపటి నుండి అనగా తేదీ: 19 .11 .2025 నుండి పత్తి జిన్నింగ్ మిల్లు ల వద్ద CCI కొనుగోళ్లు జరుపుతామని తెలిపినందున రైతులు ఎవరైనా CCI కి పత్తి అమ్ముకోవాలంటే వెంటనే స్లాట్ బుకింగ్ చేసుకోగలరు. తేదీ 17 మరియు 18 నవంబర్ రోజునకు ఇదివరకే స్లాట్ బుక్ చేసుకుంది ఉంటే తిరిగి మళ్ళీ స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

## అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం ప్రారంభం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని శ్రీ హరిహరక్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య మహా అన్నదాన కార్యక్రమం విశేషంగా సాగుతోంది. ప్రతిరోజూ అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు. అన్నదానానికి రూ.10,116 విరాళంగా అందజేసి సేవలో పాల్గొనాలని, విరాళం అందించిన భక్తుల గోత్రనామాలు ప్రతిరోజూ ప్రత్యేక అభిషేక సమయంలో ఉచ్చరించబడతాయని తెలిపారు. విరాళాలు అందజేసేవారు దేశపతి స్వామి (94948 74800), కానుగుల గోపీనాథ్ స్వామి (98857 63324) నంబర్ లో సంప్రదించాలని కోరారు.

# ఇచ్చిన హామీలు ఒక్కటైనా నెరవేర్చారా

- కాంగ్రెస్ పాలనలో కాంటా, కరెంటు కష్టాలు..
- మాజీ మంత్రి హరీష్ రావు

అక్షర దర్బార్,కేసముద్రం : వరంగల్ డిక్లరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని బిఆర్ఎస్ మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.... పత్తి రైతులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంటా వరకు అన్ని సమస్యలేనని విమర్శించారు. సమయానికి ఎరువులు అందక,కరెంటు సరిగ్గా రాక, రైతుబంధు రుణమాఫీ చేయక,బోనస్ ఊసే ఎత్తక రైతులను దగా చేశారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మేలుకోకపోతే తెల్ల బంగారాన్ని తీసుకొచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు 60 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎంకు పత్తి రైతుల పరిస్థితిపై కేంద్రానికి విన్నవించే అవకాశం రాలేదా అని ప్రశ్నించారు. ఉప ఎన్నికలలో గెలిచేందుకు విచ్చలవిడిగా డబ్బులు పంచిన రేవంత్ రెడ్డి రైతులకు మద్దతు ధర కల్పించలేకపోతున్నారా అని దుయ్యబట్టారు. ఎల్ వన్,ఎల్ టు,ఎల్ త్రీ విధానం కపాస్ యాప్ లో 8-12 శాతం ఉండాలన్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలపై పత్తి రైతులకు అరచేతిలో వైకుంఠం చేతల్లో నరకం చూపిస్తున్నారని విమర్శించారు. గత సంవత్సరం మాదిరిగానే 12 క్వింటాల పత్తిని కొని రైతులను ఆదుకోవాలని అన్నారు. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వద్దిరాజు రవిచంద్ర,తక్కెళ్లపల్లి రవీందర్ రావు,సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్,మాలోత్ కవిత, శంకర్ నాయక్, రాకేష్ రెడ్డి, నీలం దుర్గేష్,శ్రీనాథ్ రెడ్డి,ఊకంటి యాకూబ్ రెడ్డి, రావుల రవిచంద్ర రెడ్డి, నజీర్ అహ్మద్, కముటం శ్రీను, రవీందర్ రెడ్డి, ఘనపారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు....



# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదాం

**: జిల్లా సంక్షేమ అధికారి తుల రవి**

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళ వారం "నషా ముక్త్ భారత్ అభియాన్" ఐదేళ్ల వేడుకలను పురస్కరించుకుని, దివ్యాంగులు – వయోవృద్ధులు – ట్రాన్స్‌జెండర్ల సాధికార శాఖ ఆధ్వర్యంలో బహిరంగ అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి తుల రవి మాట్లాడుతూ.. "డ్రగ్స్ రూపంలో పెరుగుతున్న మహమ్మారిని కలిసి ఎదుర్కోవాలి. యువత దేశ భవిష్యత్తు. తల్లిదండ్రుల కలలు నిలబెట్టేలా ఉన్నత విద్య, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి" అని సూచించారు. యువతలో స్నేహితుల ప్రభావం వల్ల సిగరెట్, గంజాయి వంటి వ్యసనాలకు గురయ్యే ప్రమాదం తీవ్రమైందని, ఒకసారి డ్రగ్స్‌కు బానిసైతే బయ టపడటం కష్టమని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని బయటకు తీసుకురావడంలో "కౌన్సిలింగ్ ఒక్కటే ప్రధాన మార్గం" అని తుల రవి చెప్పారు. కార్యక్ర మంలో నషా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా ఇన్‌ఛార్జ్ నాగేంద్ర, డిడబ్ల్యుఓ సిబ్బంది మీర్జా బేగ్, ఎఫ్ఆర్‌వో గణేష్, డిసిపియూ, సిహెచ్ఎల్ సఖి, మహిళా సాధికా రత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా..

అక్షర దర్బార్ మల్లూర్ : మండలంలోని తాడిచెర్ల పెద్దమ్మ గుడిలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డా బండా ప్రకాష్ ఆదేశాల మేరకు నవంబర్ 21న జరిగే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ ఉపాధ్యక్షులు ముద్రవేని సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ముదిరాజ్ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించి, బీసీలకు 42%రిజర్వేషన్లు అమలు చేసి ముదిరాజ్ జనాభాకు తగ్గట్టుగా మావాటా మాకు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అక్కినవేని సమ్మయ్య, ఉపాధ్యక్షులు ఇండ్ల మహేందర్, ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజు,



తాడిచెర్ల సోసైటి చైర్మన్ బోనగిరి ఒదేలు, ముదిరాజ్ సంఘం పెద్దమనుషులు ఆకుల నర్సింగం, శ్రీనివాస్, రాజేషం, రాజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బొంతల శంకర్, ఉపాధ్యక్షులు కుంట భూమయ్య అధిక సంఖ్యలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# 25 రెట్ల పెనాల్టీ తొలగింపు

## అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- మినహాయింపు చేసిన సీఎంకు గ్రేటర్ వరంగల్ పక్షాన కృతజ్ఞతలు
- కృషి చేసిన ఇంచార్జి మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు
- రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్ల పురోగతిపై సమావేశం




అక్షరదర్బార్ , వరంగల్: అసెస్మెంట్ లకు స్వీయ కొలతలు తప్పుగా నమోదు చేసుకోవడం వల్ల 25 రెట్లు పెనాల్టీ నమోదైన వరంగల్ నగర వాసులు ఈ పెనాల్టీ మినహాయింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి నగర ప్రజలను కోరారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్ల పురోగతిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవం తంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు.

**ముఖ్యమంత్రి కృతజ్ఞతలు**

25 రెట్లు పెనాల్టీ మినహాయింపు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గ్రేటర్ వరంగల్ నగర పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. దీనికి కృషి చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరి లకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతంలో స్వంతంగా అసెస్మెంట్ ల కొలతలు నమోదు చేసు కోవచ్చునని ప్రకటించిన నేపథ్యంలో నగర వాసులు కొలతలు నమోదు చేశారని, ఈ క్రమంలో కొంత మంది పొరపాటుగా వాస్తవ కొలతల కంటే తక్కువ నమోదు చేయడం వల్ల అధికారుల పరిశీలనలో తేడాలు ఉండడం వల్ల 25 రెట్లు పెనాల్టీ పడిందని, ఆ పెనాల్టీలు ఉద్దేశ్య పూర్వకంగా చేసినవి కాదని, పొరపాటున జరగాయని, సవరించాలని ఫిర్యాదులు రావడం జరిగిందని, ఈ క్రమంలో 25 సార్లు తొలగింపు ప్రతిపాదనను కౌన్సిల్ ద్వారా తీర్మానాన్ని ప్రవేశపెట్టి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆమోదం తెలుపు కొని ప్రభుత్వానికి నివేదించామని, ఈ తీర్మానాన్ని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం అసెసిమెంట్లను తిరిగి కొలతలు చేయడంతో పాటు 25 రెట్లు పెనాల్టీని మినహాయించాలని ఆదేశించడం జరిగిం దన్నారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని సుమారు 3200 మంది గృహవాసుల అస్సెస్మెంట్లను వేగవం తంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయి లో ఆయా గృహాల తిరిగి కొలతలు వేసి నమోదుపై 25 రెట్లు పెనాల్టీ మినహాయించి రివైజ్ పన్ను నిర్ణ యించాలని అన్నారు. అధికారులు నిర్ణయించిన రివైజ్ పన్ను గృహ యజమానులు చెల్లించుకోవాలని మేయర్ అన్నారు. సమావేశంలో అదనపు కమిష నర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, ఉప కమి షనర్లు ప్రసన్న రాణి, రవీందర్ పాల్గొన్నారు.

# చర్చలు సఫలం

**- రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు**

అక్షరదర్బార్, వరంగల్: కాటన్ జిన్నింగ్ ఇండస్ట్రీస్ ఎదు ర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో తెలంగాణ స్టేట్ కాటన్ అసోసియేషన్ ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలించాయి. కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రభుత్వం చర్చించింది. ఎల్-1, ఎల్ -2, ఎల్-3 విధానం, దేశవ్యాప్తంగా ఉన్న పాలసీ, రాష్ట్ర ప్రభుత్వం పంపించే ప్రతిపాదనలు, సూచన లపై వారం పది రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పత్తి కొనుగోలు బంద్ ను విర మిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, కక్కిరాల రమేష్ వెల్లడించారు. చర్చల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్, మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ సీఎండీ తదితరులు పాల్గొన్నారు. బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు జరగనున్నాయి.

# కోటగుళ్లలో సత్యనారాయణ వ్రతాలు

**- వేదపండితులకు పట్టు వస్త్రాల సమర్పణ సన్మానం**



అక్షరదర్బార్, గణపురం: ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరా లయం కోటగుళ్లలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళ వారం ఆలయ ప్రాంగణంలో సత్యనారా యణ వ్రత కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వేద పండితులు శ్రీ దక్షిణముఖ ఆంజనేయ స్వామి దేవాలయ అర్చకులు శ్రీమాన్ గోవర్ధన వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రతం నిర్వహి చారు. పూజా కార్యక్రమాల అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు బూరుగుపల్లి మఠం గంగాధర్, జూలపల్లి నాగరాజు, కొలనుపాక భద్రంలకు పట్టు వస్త్రాలను బహుకరించి శాలువాలు పూల మాలలతో ఘనంగా సన్మానించారు.



# వరంగల్ కు జల సంచాయ్- జన్ భాగీదారి అవార్డు

- జాతీయస్థాయిలో విరాజిల్లిన వరంగల్ జిల్లా ఖ్యాతి
- దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి- 2 లో వరంగల్ జిల్లాకు ప్రథమ స్థానం
- న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్
- అవార్డుపై సంతోషం వ్యక్తం చేసిన కలెక్టర్

అక్షరదర్బార్, వరంగల్: మరోసారి జాతీయ వేదికపై వరంగల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. వరంగల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయి-జన్ భాగీదారి అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం జల్ శక్తి అభియాన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2024-2025 కు సంబంధించి "జల సంచాయ్ -జన్ భాగీదారి 1.O" అవార్డుకు దక్షిణ భారత దేశంలో జల సంరక్షణ కేటగిరి – 2 లో వరంగల్ జిల్లాకు తొలి స్థానం దక్కిన తరుణంలో మంగళ వారం డిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ డా సత్య శారద అవార్డు స్వీకరించారు. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్– జన్ భాగీదారిలో తొలి స్థానం దక్కడంతో పాటు అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులను జిల్లాలోని ప్రజల భాగస్వామ్యంతో 42,342 ఇంకుడు గుంతలు, 8,013 సేద్యపు కుంటలు, 260 చేప పిల్లల పెంపకం కుంటలు, మట్టి కట్టలు, రాక్ ఫిల్ డ్యామ్ లు, కాంటూరు కందకాలు రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, బోరు బావుల పునరుద్ధ రణ పనులు, ఫీడర్ కాలువలు, చెక్ డ్యామ్ లు, గ్రామాల్లో బోరు బావుల వద్ద వృధాగా పోయే నీటిని భూమిలోకి ఇంకే విధంగా రీఛార్జ్ పిట్ లతో పాటు రైతుల భూములలో డ్రిప్ ఇరిగేషన్, అటవి భూములలో కందకాలు, చిన్న ఊట కుంటలు మొదలైన నీటి సంరక్షణ పనులను చేయడం జరిగిందని, ఈ నీటి సంరక్షణ పనుల వలన జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయని, ఈ అవార్డుతో పాటు జిల్లాకు రూ.కోటి నగదు కూడా దక్కిందని అన్నారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లాకు ప్రతిష్టాత్మకమైన జల సంచాయ్– జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915